
07102024-DIS-08_Layout 1 10/7/2024 2:48 AM Page 1



# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



**కవి భర్తృహరి ప్రతి మానవుడికి జీవన గమనంలో ఉపయోగపడే 'నీతి', 'శృంగార', 'వైరాగ్య' శతకాలను రచించాడు. ఈ మూడు శతకాలు అమూల్య రత్నాల వంటి శ్లోకాలతో నాటినుంచి నేటివరకూ లోకాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.**

## ఒయ్యారి నడకే స్త్రీకి నగ

భర్తృహరి యోగిగా మారకముందు రచించిన శతకమ్ 'నీతి శతకమ్' కాగా ఆ తదుపరి రచించినది 'శృంగార శతకమ్'. కవి భర్తృహరి తన భార్య పింగళతో సంసార జీవితాన్ని గడిపే కాలంలో, సమాజంలోని శృంగార జీవన విధానాన్ని పరికిస్తూ ఈ 'శృంగార శతకమ్'ను వ్రాసి ఉంటాడని పండితాభిప్రాయం.

> **'శమ్భు స్వయమ్భు హరయో హరిణే- క్షణానాం/ యేనా క్రియన్త సతతం గృహకుంభదాసాః/ వాచామ గోచర చరిత్ర విచిత్రితాయ/ తస్మై నమో భగవతే మకరధ్వజాయ' -శివ, బ్రహ్మాది విష్ణు దేవుళ్లనూ సైతం వాళ్ల భార్యలకధీనులుగా చేసి ఇండ్లలో ఘటదాసులుగా మార్చి, ఇట్లా మాటలకందని చేతలనెన్నింటినో చేసేవాడైన మన్మథ దేవుడికి నమస్కారం అంటూ నమస్కరిస్తూ భర్తృహరి ఈ శతకాన్ని ప్రారంభించారు.**

ఇందులో 'స్త్రీ ప్రశంస' మొదలుకొని 'ఋతు వర్ణన పద్ధతి' వరకూ ఏడు శీర్షికలతో నూరు శ్లోకాలున్నాయి. భర్తృహరి మూడు శతకాలలోని శ్లోకభావాలననుసరించి ప్రఖ్యాత సంస్కృత కావ్య వ్యాఖ్యాత రామచంద్ర బుధేంద్రుడు శీర్షికలను నిర్ణయించాడని చెప్తారు.

**మొదటి శీర్షిక:** 'స్త్రీ ప్రశంస'లో 'స్మితేన భావేన చ లజ్జయా' సుందర దరహాసంతో, సిగ్గుతో, బెదురుతో, సొగసుగా ముఖం తిప్పుకునే విధానాలతో, క్రీగంటి చూపులతో స్త్రీలు తమ భర్తలను తమ చెంతనే బంధిస్తారంటూ, కనుబొమ్మల నేర్పుదనాల ముడిపాటులూ, ఓర చూపులూ, ముసిముసి నవ్వులూ, మెత్తని మాటల పలుకరింపులూ, సాగుతూ నిలుస్తూ మళ్లీ సాగే ఒయ్యారాల నడకలు స్త్రీలకు ఆభరణాలూ, ఆయుధాలూ అనీ పందొమ్మిది శ్లోకాల్లో స్త్రీని భర్తృహరి ప్రశంసించాడు. చక్కని కనుబొమ్మలు పద్మ సౌందర్యాన్ని అవహేళన చేయగలిగే ఆ కన్నులూ, మేలిమి పసిడిని ప్రక్కకు పెట్టగలిగే మేనిరంగూ యువతులకు పుట్టుసొమ్ములంటాడు. అందమైన మగువకు మన్మథుడు సేవకుడేనని, ఆమె కనుబొమ్మల కదలికల సూచనలతో మన్మథుడు తన బాణాలను వేసేవాడుగా నడుచుకుంటున్నాడనీ అంటాడు. చీకట్లను పోగొట్టే దీపమూ, జ్వాలాశిఖాగ్నీ, తారలూ, సూర్యచంద్రులూ ఉన్నా... కొదమ లేడి కన్నుల వంటి కనులు కలిగిన ప్రియకాంత చెంతలేకుంటే ఈ లోకమే తన కంధకారమయమనీ చెప్తాడు.

**రెండవ శీర్షిక:** 'సంభోగ (సౌఖ్య) వర్ణనము'లో సంభోగ శృంగారాన్నీ, విప్రలంభ శృంగారాన్నీ పదమూడు శ్లోకాల్లో వర్ణించాడు. 'విశ్రమ్య విశ్రమ్య వనే ద్రుమాణాం.. నివారయన్తీ శశినోమయూఖాన్' -కాంతుడి విరహంలో కాగుతున్న కోమలి ఒకామె రాత్రి తోటలో చంద్ర కిరణాల తాపాన్ని తట్టుకోవడానికి తలపై కొంగును కప్పుకొని అక్కడ తచ్చాడుతూ చెట్ల నీడల్లో కూర్చుంటూ సేద దీరిలేస్తూ తిరిగి కూర్చుంటూ మళ్లీ లేచి తిరుగుతూ ప్రియుడి కోసం ఎదురుచూస్తుందని విప్రలంభ శృంగారాన్ని వర్ణించాడు. కుముదాక్షులూ, ఇందీవరాక్షులూ అయిన మాప్రేయసుల యవ్వన రూపాలను ముసలితనం ఆవరించక మునుపే సుఖ భోగాలలో తేలడానికి మాకు ఇళ్ళకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి ఓ రాజా! అంటూ రాజును అర్థిస్తాడు.

**మూడవ శీర్షిక:** 'పక్షద్వయనిరూపణం'లో స్త్రీలను ప్రేమతో చూసుకునేవారికి ఇహలోక సౌఖ్యాలూ, స్త్రీలపై విరక్తితో వారిని త్యజించే వారికి పరలోక సౌఖ్యాలు కలుగుతాయనీ అనురక్తి, విరక్తి అనే రెండు పక్షాలుగా ఏడు శ్లోకాల్లో వర్ణించాడు. మానవా- నీవు విరాగివై అడవి జింకలకు పచ్చని దర్భలను ఆహారంగా అందిస్తూ అక్కడే అడవిలో ఉండిపో లేదా అనురాగివై నీ వధూమణికి తాంబూలాన్ని ప్రేమతో అందిస్తూ నీ గృహ స్వర్గంలోనే ఉండిపో! అని చెప్తాడు. ఇక్కడినుంచే భర్తృహరి వైరాగ్యం వైపు మళ్లుతున్నాడని చెప్పవచ్చు. ఓ జనులారా! ఘననితంబినులైన ప్రమదల కన్నా మనోజ్ఞమైన వారెవరూ లోకంలో లేరు, విరహాన్ని రగిలించి ఏడిపించడంలో వీళ్ల కన్నా ఇంకెవరూ లేరని అంటాడు.

**నాలుగవ శీర్షిక:** 'కామినీ గర్హణము'లో 'కాన్తేత్యుత్పలలోచనేతి విపులో శోణీభరే..' అన్ని తెలిసిన విద్వాంసుడూ యవ్వనాదులు అశాశ్వతం అని తెలిసి కూడా అందమైనది మగువ అని మెచ్చుకుంటూ మన్మథకేళుల్లో తేలియాడుతుంటాడు. ఆహా! మోహపు దుశ్చేష్ట ఎంతటి ఆశ్చర్యకరమని అంటాడు. అతివను, తలచుకుంటే ఆమె మన్మథ తాపాన్ని రగిలిస్తుందనీ, చూస్తేనే మదన సంబంధోన్మాదాన్ని పెంచుతుందనీ, తాకితేనే మోహపు తన్మయత్వాన్ని కలిగిస్తుందనీ.. ఇట్లా అస్థిరంగా, బలహీనంగా మార్చే ఆ అతివ ప్రేయసి ఎట్లా అవుతుందని ప్రశ్నిస్తాడు. అనురాగం ఉన్నప్పుడు ఆమె అమృతలత, అనురాగం లేనప్పుడు ఆమెనే విషమంజరి అని ఇట్లా స్త్రీని గర్హిస్తూ ఇరువై శ్లోకాలు రచించాడు భర్తృహరి.

**ఐదవ శీర్షిక:** 'సువిరక్త పద్ధతి'లో స్త్రీల పట్ల విముఖులైన వాళ్లలో సువిరక్తులూ, దుర్విరక్తులూ అని పురుషులలో రెండు రకాలని చెప్తాడు. తెల్లని విశాల నేత్రాలు కలవారైన, పరువాల గరువాల మిడిసిపాటుతో ఎద సంపద గలవారైన అతివల అందమైన రూపాలను చూసి ఏ పురుషుల మనసులు మదన వికారానికి లొంగిపోవో వారే ధన్యులు అంటూ సువిరక్త పద్ధతిని తొమ్మిది శ్లోకాల్లో వరిస్తాడు.

> **ఇక హేమంత ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ పెరుగు, నెయ్యిలను కలిపి సుష్ఠుగా భుజించినవాడు, భార్యల బిగి కౌగిళ్ళలో ఉన్నవారు, తాంబూలం నమలి ఇళ్ల లోలోపలి గదుల్లో స్త్రీ పురుషులు సుఖంగా నిద్రిస్తున్నారంటాడు భర్తృహరి.**

**ఆరవ శీర్షిక:** 'దుర్విరక్త పద్ధతి'లో 'తావదేవ కృతినామపి స్ఫురత్యేష నిర్మల వివేకదీపః' విద్వాంసులనెంతవరకూ ఆడవాళ్ల వయ్యారాల వాలుచూపుల అంచులు తాకవో అంతవరకూ ఆ విద్వాంసుల నిర్మల వివేకదీపం ఉజ్వలంగా ప్రకాశిస్తుందంటూ స్త్రీలపై నిందాపూర్వకంగా పది శ్లోకాలు రాశాడు.

> **ఇక ఏడవ శీర్షిక: 'ఋతు వర్ణన పద్ధతి'లో 'పరిమళభృతో వాతాః శాఖా నవాంకుర కోటయోః' పవనాలు పరిమళభరితాలయ్యాయి, చెట్లకొమ్మలు క్రొత్త చిగురులు వేశాయి, మగ కోకిలల కాకలీ స్వర గీతాలు ఆడ కోకిలలకు పియాన్ని కూరుస్తున్నాయి, వనితల వదనేందు బింబాలు మరుకేళుల వల్ల చెమట చుక్కలతో చెమరుస్తున్నాయి, వసంతం వస్తూండగానే ధరిత్రిపై ప్రతిదీ సుందర మధుర గుణ ప్రవర్ధమానమై ప్రవర్ధిల్లుతుదన్నదని వసంత ఋతువు గురించి ఆరు శ్లోకాల్లో వర్ణించాడు.**

'అచ్చాచ్ఛచన్దనరసార్ద్రతరా మృగాక్ష్యో' స్వచ్ఛ చందనరసాల మైపూతలతో స్త్రీలూ, జలయంత్ర సదనాలు, పుష్పాలు, పున్నమి వెన్నెలా, విరజాజి వాసనల మంద మారుతమూ మున్నగునవి గ్రీష్మ ఋతువులో హర్షాన్నీ, మన్మథుడి గర్వాన్నీ పెంచుతున్నాయని గ్రీష్మఋతువును భర్తృహరి మూడు శ్లోకాల్లో వర్ణించాడు. ఇక వర్షఋతువు గురించి కామాన్ని ఉద్దీప్తం చేసేదని చెప్తూ ఆరు శ్లోకాల్లో వర్ణించాడు. ఇంకా శరదృతువులో పురుషుడు నడిరాత్రి వరకు అటూ ఇటూ పొరలి చిన్న కునుకు తీసి లేచి ప్రియకాంతతో కూడి తర్వాత ఆరని దాహంతో ఉన్నవాడై తన ప్రియకాంత కౌగిలి నుంచి కొంత విడి వడి మట్టి పాత్ర నుంచి అందించే నీటిధారను -శరత్కాల చంద్రుడి వెన్నెలలో ఎవడైతే తాగడో వాడు అదృష్ట హీనుడంటూ ఒక్క శ్లోకంలో అద్భుతంగా వర్ణించాడు.

చివర శిశిర ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ శిశిర ఋతువే పవనుడై అతివేగంగా వీస్తూ స్త్రీల కేశాలను చిందరవందర చేస్తూ, వస్త్రాలను ఈడ్చేస్తూ, పెదవులు కొరుక్కునేలా చేస్తూ భర్తల వలెనే సంచరిస్తున్నాడని చెప్తాడు. ఇట్లా భర్తృహరి నాటి సమాజ శృంగార జీవనాన్ని చెప్తూ శృంగారంలోని అతిని వర్జిస్తూ 'శృంగార శతకాన్ని' రచించాడు.



'రఘువర్మ' (టీయల్యన్)
92900 93933



కిరణ్ వరికిల్ల

## మనిషికీ...

పొద్దున్నే,
వెలుగుల
పూలబుట్టను నెత్తినెత్తుకొని
అడవి,
నగరంలోకి వచ్చింది..
మధ్యాహ్నానికి,
రంగురంగులు సింగారించుకొనీ
అడవి, మొక్కేటి
గౌరమ్మైంది..
సాయంత్రానికి,
చప్పట్ల జాతరలో,
పాటల పూజల్లో, అడవి
ఊరేగింపుల బతుకమ్మైంది,
రాత్రి, వీడ్కోలుల చీకటినద్దుకొని
చల్లని చెరువు గుండెల్లోకి
అడవి
మెల్లిగా ఒదిగిపోయింది...
అవ్యక్తమై
అడవి, అడవిలోకి చేరిపోయింది..!

పొద్దున- వెలుగు
మధ్యాహ్నం- సింగారం
సాయంత్రం- గౌరవం
రాత్రి- వీడ్కోలు,
ఇది బతుకమ్మకే కాదు
మనిషి జీవితానికి కూడా!




డాక్టర్ కాసర్ల నరేష్ రావు
94414 06252

## గట్టి గింజల పంట

**'అద్దం అబద్ధం ఆడదు
మాయా దర్పణాలు సుబద్ధమాడవు
పేదరికం తగ్గింది
పేదలు పెరిగారు'**

**'రెండు పూల మధ్య ఖాళీని
పరిమళం పూరిస్తుంది
ఇద్దరు మనుషుల మధ్య బంధాన్ని
మతం నరుకుతున్నది'**

తెలుగులో అభ్యుదయ కవిత్వం మొదలుకావడంతోనే వచన కవిత్వం మొదలైంది. తెలుగు వచన కవిత్వం గత 90 ఏండ్లలో రూపపరంగా అనేక ప్రయోగాలకు లోనైంది. 18 పర్వాలు ప్రాచీన కావ్యమైతే, 18 పాదాలు ఆధునిక కవిత అనిపించుకున్నది. ఎన్ని గజాలు రాశామన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పామన్నది ప్రధానమని కూడా అనిపించుకున్నది. ఒకటి, రెండు పుటల్లో కవితలు వస్తున్న కాలంలోనే దీర్ఘకవితలు, వచన మహాకావ్యాలు వచ్చాయి. గత మూడు దశాబ్దాల్లో మినీ కవిత, హైకూలు, నానీలు, నానోలు, గాథలు, రెక్కలు వంటి అనేక ప్రయోగాలు జరిగాయి.



'నిజం' కలం పేరుగా గల కవి జి.శ్రీరామమూర్తి. ఈయన 'నివురు', 'నాలుగో పాదం' వంటి వచనకావ్యాలు రాసి, ఇప్పుడు 'రంగురంగుల సూర్యోదయాలు' అనే ముక్త కవచన కవితల సంపుటి ప్రచురించారు. ఇవి నానీలు, రెక్కలు, గాథలు, మినీ కవితలు వంటి ఏ ప్రక్రియకూ చెందినవి కావు. కవి కూడా వీటికి రూపపరమైన పేరేదీ పెట్టలేదు. అన్నీ స్వతంత్ర కవితలు. నాలుగు పాదాల కవిత. ప్రతి కవితా రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిభాగం ప్రతిపాదనగా, రెండవ భాగం దానికి వ్యాఖ్యగా ఉంటుంది. మొదటిభాగంలో సామాజిక వాస్తవికత వస్తువుగా, రెండవ భాగంలో దాని మీద కవి దృక్పథంగా ఉంటాయి. 'రంగురంగుల సూర్యోదయాలు' అంటే విభిన్న వస్తువులు గల కవితల సమాహారం.

ఈ కవితలు మాటల ముక్కలు కావు. వర్తమాన, సామాజిక వాస్తవికతను తనదైన వ్యాఖ్యలతో కవి ఆవిష్కరించారు. వర్తమాన ఆర్థిక, రాజకీయ, సాంఘిక సాంస్కృతిక, తాత్విక రంగాల మీద కవి చేసిన సృజనాత్మక విమర్శలు ఈ సూర్యోదయాలు. ఈ కవితలలో మనకు ప్రధానంగా కనిపించేవి ప్రకృతిని మానవీకరించడం, మనిషిని ప్రకృతీకరించడం, మనిషికీ ప్రకృతికీ గల సంబంధాన్ని చెప్పడం, ప్రకృతి ముందు మనిషి ఎంత దిగువన ఉన్నాడో చెప్పడం వంటివి.

ప్రకృతి గత వస్తువులు తమ మధ్య ఏర్పడిన ఖాళీలను పూరించుకుంటుంటే, మనుషులు తమ మధ్య మతంతో దూరం తెచ్చుకుంటున్నారని కవి దెప్పి పొడిచారు. మతోన్మాదుల మాడు పగులగొట్టే చురక ఇది.

త్రిదండి చినజియ్యరు స్వామి ఇటీవల సమతామూర్తి పేరుతో రామానుజుని విగ్రహాన్ని భారీఎత్తున హైదరాబాద్‌లో ఆవిష్కరింపజేశారు. అలాంటి వారే ఒక సమయంలో కులాలు పోకూడదు, ఉండాలి. ఏ కులం పని ఆ కులం చేయాలి. ఏ తిండి తిన్న వాళ్లకు ఆ బుద్ధులు వస్తాయని చెప్పిన మాటలు చాలా వివాదమయ్యాయి. సాంఘిక వివక్షకు గురౌతున్న సామాజిక న్యాయవాదులు ఆయన అభిప్రాయాలను తీవ్రంగా ఖండించారు. బహుశా ఈనే పథ్యంలో 'నిజం' కవి ఒక ముక్తకం రాశారు

**'ఇక్కడ జరుగుతున్నది
ఏమిటో యికనైనా తెలుసుకోండి
కులం అణచివేతల
జియ్యరుల రాజ్యమండి'**

కవిత్వం మీద కవిత్వం రాయని తెలుగు కవులు అరుదుగా ఉంటారు. పది కవితలు రాస్తే ఒకటైనా కవిత్వం మీద కవిత ఉంటుంది. నిజాం కవి కూడా ఈ తానులో పోగయ్యారు. కవిత్వం గురించి పాతిక దాకా కవితలు రాశారు. ఈయనకు తాను చేసే పనిమీద అపారమైన నమ్మకమున్నది.

**'శబ్దానికి చితి
పేర్చడమే నా పని
అది కవిత్వమై
మండుతుంది'**

'నిజం' కవి శ్రీరామమూర్తి 'రంగుల సూర్యోదయాలు' కావ్యం నిండా వర్తమాన సామాజిక వాస్తవికతలోని అనేక పార్శ్వాలు విమర్శనాత్మకంగా ప్రతిబింబిస్తున్నాయి. వేమన లాగే ఈయన కూడా తన వస్తువును అభివ్యక్తం చేయడానికి తన పరిసర ప్రకృతినే ఆశ్రయించారు. ఈ కావ్యంలోని కవితలు 'గట్టి గింజల పంట' వంటివి. ఇవి చూడటానికి సూత్రప్రాయాలు, చెప్పడానికి భాష్య ప్రాయాలు.



రాచపాలెం చంద్రశేఖర రెడ్డి
94402 22117



కిరణ్ వరికిల్ల

## ఊపిరులు

నేను..
నా గదిలో ఉన్నప్పుడు
అల్మైరాల్లో ఇష్టపడి పెంచుకున్న
ఓ అడుగు మేర ఎత్తున్న
తెల్లని చెట్ల మధ్య సంచరిస్తుంటాను
వాటి కొమ్మల కింద
అక్షరాలతో సేద తీరుతాను

నేను..
బయటికి వెళ్ళినప్పుడు
రోడ్డుకి ఇరువేపులా ఏపుగా పెరిగిన
నేలలో పర్ఫెక్ట్ బైండింగ్‌తో ఉన్న
పచ్చని పుస్తకాలను చూస్తుంటాను
వాటి పుటల్ని గమనిస్తూ
ఆక్సిజన్ నింపుకుంటాను

నేను..
పలక పట్టిన్నాటి నుంచి
చెట్లూ పుస్తకాలూ
నా బతుక్కి
శ్వాసనందిస్తున్న
చదువుల తిత్తులు



నలిమెల భాస్కర్

## ఆహ్వానం

2024 అక్టోబర్ 8వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 'గుర్రం జాషువా సాహిత్య సమాలోచన కార్యక్రమం జరుగనున్నది. ఈ కార్యక్రమంలో వక్తలుగా డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, డాక్టర్ వెంకట్ పరిమళ్, వల్లభాపురం జనార్ధన్, వహీద్‌ఖాన్ పాల్గొననున్నారు. అందరూ ఆహ్వానితులే.

**- వి.భానుచందర్, 94412 36242**

## మరి మా మాటేమిటి..?

**ఇది మిత్రుడు పసునూరి రవీందర్ రాసిన 'మీది మీదే.. మాది మాదే..' వ్యాసానికి సమాధానం కాదు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న ఆంధ్రోళ్లలో ఒకడినైన నా ప్రశ్న మాత్రమే. తెలంగాణ కోసం కాసింత కవిత్వం, ఒకింత కన్నీరు కార్చాం కదా.. మరి మా గురించి ఏమిటన్నదే నా ప్రశ్న. 'మీది మీదే... మాది మాదే...' అని తెలంగాణ మిత్రులు తేల్చేశారు. ఎవరిది ఏదో... తమది ఏదో... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాహితీవేత్తలు తేల్చలేదు. అసలు గంట ఎవరు కట్టాలో కూడా వాళ్లు నిర్ణయించుకున్నట్టుగా కనిపించడం లేదు. తొలి, మలితరం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ పోరాటానికి మద్దతు పలికిన మాలాంటి వారు.. అంటే ఆంధ్రోళ్లన్న మాట. అలాంటి మా మాటేమిటన్నదే నా ఈ అనుమానం. ఎవరికి వారు హద్దులు గీసుకుంటున్న వేళ.. ఎదుటి వారి హద్దులు కూడా నిర్ణయిస్తున్న సమయాన.. మూడో జాతి మనుషుల్లా మిగిలిపోయిన మా మాటేమిటన్నదే నా వేదన. తెలంగాణకు మద్దతుగా నిలిచాం కాబట్టి మేం ఆంధ్రోళ్లకు శత్రువులుగా మిగిలామనుకోవాలా!?.. లేక తెలంగాణ వచ్చేసింది కాబట్టి వాళ్లని ఇక ఆంధ్రోళ్లుగానే చూడాలని తెలంగాణ మిత్రులు నిర్ధారించుకున్నారనుకోవాలా?.. అన్నదే నా సంశయం.**



ప్రత్యేక తెలంగాణ కల సాకారమైంది. ఈ కల సాకారమవడంలో తెలంగాణ కవులు, రచయితలు, మేధావుల పాత్ర చాలా ఉన్నది. ఇందుకు విరుద్ధంగా సమైక్యవాదాన్ని వినిపించిన కవులు, రచయితలు, మేధావులు కూడా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఆరేడేండ్ల ముందు తెలుగు సాహిత్యం (మిత్రమా.. తెలుగు సాహిత్యమే.. మీరు ప్రస్తావించినట్టుగా తెలుగు భాష, తెలుగుదనం, సంస్కృతి, ఉమ్మడి వారసత్వం వంటి పేర్లు కాదు) కూడా రెండుగానే చీలిపోయింది. తెలంగాణను కాంక్షిస్తూ రాసేవారు తెలంగాణ వాదులుగా, విడిపోవడానికి వీల్లేదనే వారంతా సమైక్యవాదులుగా చీలిపోయిన దశ అది.

సరిగ్గా ఈ సమయంలోనే, తెలంగాణను కాంక్షించే 'ఆంధ్రోళ్లు' కొందరున్నారు. వీరు కూడా ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా కవిత్వం రాశారు, వ్యాసాలు రాశారు. అన్నట్టు సమైక్యవాదుల నుంచి తిట్లు, శాపనార్థాలు కూడా అనుభవించారు. మిలియన్ మార్చ్ సమయంలో ట్యాంక్‌బండ్ మీదున్న ఆంధ్ర సాహితీవేత్తల విగ్రహాలను కూల్చివేసిన సమయంలో మాకు ఎదురైన ప్రశ్నలు, అమ్ముడుపోయారనే మాటలు భరించలేక ఎంత ఇబ్బంది పడ్డామో మేం ఎప్పుడూ బహిర్గతం చేయలేదు. ఆ సమయంలో కూడా అలాంటి ప్రశ్నలకు నా నుంచి వచ్చిన సమాధానం ఉద్యమ సమయంలో విసిరిన రాళ్లన్నీ ఒకే వైపు పడవు. వాటిలో కొన్ని రాళ్లు ఉద్యమకారులకూ తగులుతాయి. అంతమాత్రాన ఉద్యమాన్ని తప్పుబట్టలేం. ఉద్యమ కాంక్షను వీడలేం అని సన్నిహిత సమైక్యవాదులకు చెప్పాను.

> **తెలంగాణ ఉద్యమ సమయంలో మేం చూపించింది సానుభూతి కాదు, సహానుభూతి. అవును, కచ్చితంగా సహానుభూతే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కానీ, రాయలసీమ నుంచి కానీ ఆనాడు వచ్చిన సాహిత్యం ఒక్కసారి పరిశీలిస్తే ఆ విషయం అర్థం చేసుకోగలం. ఇక, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల నుంచి కూడా తెలంగాణ ఏర్పడాల్సిన ఆవశ్యకత గురించి సాహిత్యం వచ్చింది. అయితే, అది పరిమిత సంఖ్యలోనే కావచ్చు.**

నా మటుకు నేను తెలంగాణను కాంక్షిస్తూ అనేక వ్యాసాలు రాశాను. కవిత్వం కూడా రాశాను. చాలా చోట్ల ప్రత్యేక తెలంగాణ రావాల్సిన, ఇవ్వాల్సిన అంశం గురించే కాదు, ప్రత్యేక తెలంగాణ ఏర్పడాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడాను. అంతెందుకు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా హైదరాబాద్‌తో సహా ఇతర తెలంగాణ జిల్లాల్లో బతుకుతున్నవారు (వీళ్లను సెటిలర్స్ అన్నారు. ఎందుకో నాకు ఆ మాట నచ్చదు) తెలంగాణ ఏలికల్లో ఇబ్బందులు పడుతున్నారంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో గుండెలు బాదుకుంటే.. అదంతా తప్పు... ఇక్కడున్న వారంతా చాలా బాగున్నారని, వారిని తెలంగాణ వాసులు చాలా బాగా చూసుకుంటున్నారంటూ నేను ఓ వ్యాసం రాశాను. ఆ వ్యాసం ప్రచురించింది కూడా నమస్తే తెలంగాణ దినప్రతికే. ఆ నా వ్యాసం తెలంగాణలో నన్ను ఎక్కువమంది అభిమానించేలా చేసింది. నన్ను తెలంగాణ సానుభూతిపరుడిగా కాకుండా తెలంగాణ వాడిగానే చూసింది.

నిజానికి, తెలంగాణ కోసం మలితరం ఉద్యమం ప్రారంభించడానికి ముందే ఈ ప్రత్యేక తెలంగాణను కాంక్షించే సమూహం ఉండేది. ఆ సమూహంలో ఆంధ్రోళ్లు కూడా కొందరున్నారు. అయితే, తెలంగాణ కల ఉద్యమరూపం తీసుకోలేదు కాబట్టి, ఆ కల కవిత్వంగానో, వ్యాసాలుగానో వచ్చిందే తప్ప ఓ పోరాట రూపానికి మద్దతుగా మాత్రం రాలేదు. వామపక్ష పార్టీల్లో ముఖ్యంగా, నాటి పీపుల్స్‌వార్,. నేటి మావోయిస్టు పార్టీ రాజకీయాల పట్ల కాసింత సానుభూతిగా ఉన్నవారంతా ప్రత్యేక తెలంగాణ వస్తే చూడాలనుందని కలగన్నవారే.

తొలితరం తెలంగాణ ఉద్యమకాలంలో కమ్యూనిస్టుల్లో చాలామంది ప్రాంతీయవాదాన్ని వ్యతిరేకించినా పీపుల్స్‌వార్ వ్యవస్థాపకులైన కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి మాత్రం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావాల్సిందేనని ఆకాంక్షించారు. కొండపల్లి సీతారామయ్య అయితే అప్పట్లో కొన్ని వ్యాసాలు రాయడమే కాదు, కమ్యూనిస్టు పార్టీల్లో చర్చ కూడా లేవదీశాడు. కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి ఇద్దరూ ఉద్యోగం అయితే తెలంగాణలో చేశారేమో కానీ వాళ్లిద్దరు కూడా ఆంధ్రోళ్లే. ఇప్పుడు మిత్రుడు పసునూరి రవీందర్ 'మీది మీదే.. మాది మాదే' అంటున్నారు. ఈ సరికొత్త వాదంలో తెలంగాణ రావాలని కాంక్షించిన జన్మతహ ఆంధ్రోళ్లమైన మాలాంటి వాళ్లం ఎటువైపు ఉంటామన్నదే నా ఈ ప్రశ్న.

> **తెలంగాణను కాంక్షించింది ఒక్క సైద్ధాంతికంగానే కాదు మిత్రమా. అక్కడి సంస్కృతి, ఆ ప్రేమ, అనురాగం, అడక్కుండానే కడుపులో అన్నం తీసిపెట్టే అచ్చమైన మనుషులను చూసిన తర్వాతే. అంతే కాదు, సహజన్మ అన్నట్టు స్వరాష్ట్ర పాలకుల నుంచి తెలంగాణవాసులు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి, పరోక్షంగా చదువుకున్న తర్వాతే తెలంగాణ రావాలనే మా ఆకాంక్ష మరింత పెంచుకున్నాం.**

మీకు నీళ్లు రావడం కోసం మీరెన్ని కన్నీళ్లు కార్చారో... ఇప్పుడు అటు ఇటు కాకుండా పోయిన ఈ మూడో తరగతి మనుషులుగా పిలవబడే మేం కూడా అంతే కన్నీరు కారుస్తున్నాం. మేం కార్చిన కన్నీళ్లకు బహుమతిగా మేం ఎటూ కాకుండా పోవడమే మాకు ఎదురైన విషాదం. ఓ భాషగా తెలుగు గురించి మాట్లాడాల్సి వస్తే కొందరికి కొత్తగా వచ్చిన ఇబ్బంది ఏమిటో నాకు అర్థం కావడం లేదు. దేశంలో అనేక రాష్ట్రాల్లో హిందీ మాట్లాడతారు. భాషకు సంబంధించి యాసలో మార్పులుంటాయి కానీ భాషలో కాదు గదా? తెలంగాణ ఏర్పడకముందు ఆంధ్రప్రదేశ్ అనేవారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని విడివిడిగాను, రెంటిని కలపాల్సి వస్తే తెలుగు రాష్ట్రాలని అంటున్నారు. దీని వల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటన్నదే నాకు అర్థం కాని ప్రశ్న. ఇతర అంశాలు అంటే సాహిత్య అకాడమీలో సభ్యులకు సంబంధించి మీ ప్రతిపాదనకు నేను ఓటు వేస్తాను. పత్రికల్లో ప్రాధాన్యం ఇవ్వడం వంటివి ఆ పత్రిక పాలసీగా ఉంటుంది కాబట్టి ఓ జర్నలిస్టుగా నేను సమాధానం చెప్పలేను. భవిష్యత్తులో అస్తిత్వవాద ఉద్యమాలు వస్తే మాలాంటి వాళ్లు ఎటువైపు ప్రయాణించాలో తెలియని ఓ ప్రశ్న కూడా ఇప్పటినుంచే ప్రారంభం కావడం నన్ను ఇబ్బంది పెడుతున్న మరో విషాదం. చివరగా మీరు సరే.. వాళ్లు సరే.. మధ్యలో మా మాటేమిటన్నదే నా ప్రశ్న.



ముక్కామల చక్రధర్
99120 19929